# నిన్నటి వెన్నెల

రాజ్యం నాకెదురుగా తిరిగి నా మీద చెయ్యేసి పడుకుని వొళ్ళు తెలీకుండా నిద్ర పోతోంది. ఆమెభుజం కిందుగా వీపు చుట్టూ వున్న నా చెయ్యి నొప్పెడుతోంది. మెల్లగా బయటికి లాగాను, గడియారం చూస్తే రెండున్నరయింది. నాకు నిద్ర రావటం లేదు.

నా గుండెల మీద వున్న రాజ్యం చేతిని మెల్లగా తొలగించాను . మంచమ్మీద నుంచి లేచాను. రాజ్యం కదల్లేదు, మెదల్లేదు - అలాగే నిద్ర పోతోంది. ఆమె జుట్టు రేగింది. చీర చిందర వందరగా ఉంది. రేగిన జుట్టులో ఓ పాయముందు కొచ్చి చెమటకి తడిసిన నుదుటి మీద అతుక్కుంది. ఫాన్ స్పీడ్ పెంచి, చప్పుడు కాకుండా తలుపు తెరిచి, గదిలోంచి బయటి కొచ్చాను.

గది గుమ్మం ముందు బాల్కనీలో కూర్చుని సిగరెట్ వెలిగించాను. బయట చల్లగా వుంది ఆకాశంలో చంద్రుడు మటుకు అవసాన దశలో ఉన్నాడు.

ఆ గది నాది కాదు. అది హోటల్ గది. గదిలో పడుకున్న రాజ్యం నా భార్య కాదు. ఆమె ఒకప్పుడు నా స్నేహితురాలు. ఇప్పుడు మాత్రం ఆ నగరంలో నెలకి నాలుగొందలో ఆ పైన మరో యాభయ్యో తెచ్చుకునే గుమాస్తా కోటేశ్వర్రావుకి అర్ధాంగి.

రాజ్యం నాకిప్పుడో పెద్ద సమస్య తెచ్చి పెట్టింది. ఏం చెయ్యాలో నాకేమీ తోచడం లేదు. ఇంత పని చేస్తుందనుకుంటే ముందే కాస్త జాగ్రత్త పడి ఉండేవాణ్ణి.

రాజ్యానికీ వెన్నెలకీ ఏదో చుట్టరిక ముంది. ఆరేళ్ళ క్రితం -నా కప్పటి కింకా ఉద్యోగం రాలేదు - మా వూళ్ళోనే ఉన్నాను.ఎమ్మే ఫస్టుక్లాసులో పాసయి, ఈ చదువింక చాల్లెమ్మనుకుని, నాకు నచ్చిన అయిదారు ఉద్యోగాలకి అప్లికేషన్లు పారేసి, హాయిగా ఇంట్లో కూర్చున్నాను. మర్నాటి కల్లా రాక పోతుందా అనుకున్న ఉద్యోగం ఆర్నెల్లయినా రాలేదు.

ఉద్యోగం త్వరగా రానందువల్ల నష్టం గాని, అసలు ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం గాని నా కంతగా లేక పోయినా - అన్నాళ్ళు వూరికే ఇంట్లో కూర్చోడం కష్టమై పోయింది. పుట్టి పెరిగింది అక్కడే అయినా, పై చదువులన్నీ పట్నాల్లోనూ నగరాల్లోనూ సాగడంతో - ఆ పల్లెటూళ్లో నాకేమీ తోచకుండా అయి పోయింది. చెయ్యడానికి పనేమీ లేక, చెప్పుకోదగిన స్నేహితుల్లేక, సినిమాల్లేక, షికార్లు లేక రోజులు గడవటం మహా కష్టమై పోయింది. ఇక ఉద్యోగం దొరికినా దొరక్క పోయినా ఏదో వంకమీద మళ్ళీపట్నమెళ్ళి పోయిమకాం వేద్దామా అనుకుంటున్న తరుణంలో - రాజ్యం మా వూరొచ్చింది.

ఒకనాటి సాయంత్రం రాత్రిగా మారుతున్న సమయాన - నేను డాబా మీద ఆరుబయట ఒక్కణ్ణీ కూర్చుని వుండగా ముందుగా మల్లెపూల వాస నొచ్చింది: ఆ వెనక రాజ్యం వచ్చింది:ఆమె వచ్చీ రాగానే వెన్నె లొచ్చింది. అప్పటిదాకా అంతు లేకుండా పోయిన గాలి చడీ చప్పుడూ లేకుండా చల్లగా మెల్లగా వచ్చింది.

సరాసరి నా దగ్గిర కొచ్చి, నాపక్కనే కూర్చుని , నా వంక చూసి పలకరింపుగా నవ్వి - ఆ తర్వాత 'బాగున్నావా' ? అని పలకరించింది రాజ్యం.

అలాంటి సమయంలో ఆ వెన్నెల్లో లేత వెన్నెల్లాంటి అమ్మాయి ఆకస్మాత్తుగా అందంగా వచ్చి ,పక్కనే కూర్చుని పలకరించే సరికి నాకు నోట మాట రాలేదు: ఏమనాలో తెలీలేదు ఎవరీ అమ్మాయని తెల్లబోయి చూస్తున్నాను.

'ఏమిటలా చూస్తావు? నన్ను గుర్తు పట్టలేదా? నేను... రాజ్యాన్ని ..!' అంది రాజ్యం, మరింత హాయిగా నవ్వుతూ.

ఆ అమ్మాయి ఎవరన్నా కానీ! అంత అందమైన అమ్మాయిని మర్చిపోయినందుకు ఆ క్షణాన నాకు సిగ్గేసింది: నా మీద నాకు కోపమొచ్చింది . కాని ఆ నవ్వు మళ్ళా చూశాక, ఆ కళ్ళల్లోకి మరీ మరీ చూశాక, కింది పెదవికిందుగా వున్న ఆ నల్లటి మచ్చ చూశాక - అప్పుడు గుర్తొచ్చింది రాజ్యం!

రాజ్యం మా పక్కింటి అమ్మాయి. రాఘవయ్య మేష్టారి చిన్న కూతురు.

నా చిన్న ప్పుడెప్పుడో రాఘవయ్య మేష్టారు మా వూరొచ్చారు. వచ్చీరావటమే మా పక్కింట్లో అద్దెకి దిగారు. నాకప్పుడు నాలుగైదేళ్ళ కన్నా ఎక్కు వుండవు. అప్పటికి మా

వూళ్ళోవున్న ప్రైమరీ స్కూలుకి ముచ్చటగా మూడు రోజులు మాత్రం వెళ్ళి, పంతులు కొట్టాడని ఇంటి కొచ్చి ఏడ్చి నానా రభసాచేసి , నాలుగో రోజు నించీ బడి మానేశాను.

నేనొక్కణ్ణే కొడుకుని కావడంచేత మా అమ్మానాన్నా కూడా అప్పటికి నన్నొదిలేసి వూరుకున్నారు. ప్రైవేటుగా మరో పంతులిచేత చదువు చెప్పిద్దామనుకుని, సరైన వాళ్ళెవరూ దొరక్క వూరుకున్నారు. అలాంటి సమయానికి రాఘవయ్య మేష్టారు మావూరు రావటమూ, మా యింటి పక్కనే వచ్చి దిగడమూ జరిగింది.

ఆయనంతకు ముందు మరేదో వూళ్ళో వుంటూ, అక్కడ ట్యూషన్లు సరిగా నడవక, పొట్ట గడవక పక్కనే పచ్చగా వున్న మా వూరొచ్చి చేరారు. ఊళ్లో పెద్దల్ని నలుగుర్నీ కలుసుకుని, అందరి చేతా సరేనవిపించుకుని, అద్దెకోయిల్లు తీసుకుని అందులోనే ఏది మంది పిల్లల్ని కూచోబెట్టి పాఠాలు ప్రారంభించారు,

పంతులు దొరకటమేకాక, పక్కనే బడి కావటంతో నాకింక అక్కడ చేరక తప్పలేదు. అ, ఆలతో మొదలెట్టి అయిదో క్లాసు వరకూ రాఘవయ్య మేష్టారి దగ్గరే చదివాను.

నే నాయన దగ్గరచేరిన కొద్ది రోజు లకే రాజ్యానికీ నాకూ స్నేహం కలిసింది. రాజ్యం కూడా ఇంచుమించు నాయీడుదే. ఇద్దరం ఒకేసారి అక్షరాలు నేర్చుకున్నాం. ఒకే సారి పుస్తకంపట్టాం. నేను పట్నమెళ్ళిహైస్కూల్లో చేరేదాకా ఒకే క్లాసులో వుంటూ వచ్చాం.

రాజ్యం చిన్నప్పట్నించీ అల్లరిపిల్ల

తన యిల్లుగదా, మేష్టారు తనతండ్రే గదా అని విర్రవీగేది. తోటి పిల్లలందరి మీదా పెత్తనం చేసేది; అందర్నీ ఏడిపించేది.

ఇరుగుపొరుగు యిళ్ళు కావటంతో మేష్టారి భార్యకీ మా అమ్మకీ కూడా స్నేహం కలిసింది. మా యింట్లోంచి కూరలూ, పాలూ, పెరుగూ, పండుగలకయితే పిండివంటలూ ఇలాంటివన్నీ మాష్టారి యింట్లోకి నిత్యమూ సరఫరా అవుతుండేవి రాజ్యం బళ్ళో కూర్చోనప్పుడల్లా మా యింట్లోనే వుండేది. ఆటలూ పాటలూ, అల్లరి గంతులూ మా యిద్దరిదీ యిష్టా రాజ్యంగా వుండేది.

ఆ రకంగా ఏడెనిమిదేళ్ళు 'గడిచాయి. మా వూళ్లో నా చదువూ అయిపోయింది పట్నమెళ్ళి హైస్కూల్లో చేరడానికి బయల్దేరాను. నేనూ హైస్కూల్లో చేరతానని రాజ్యం ఏడిచింది.

పట్నంపంపి చదువు చెప్పించేశక్తి లేక రాఘవయ్య మేష్టారు వద్దన్నారు. రాజ్యం అప్పటికే పెద్దమనిషైంది. ఇంకా ఆడపిల్లకి చదువేంటని వాళ్ళమ్మ వద్దంది. రాజ్యాన్ని వదిలేసి నేను పట్నమెళ్ళి పోయాను.

వెళ్ళిన వాణ్ణి సంక్రాంతి శెలవలదాకా మళ్ళీ యింటికి రాలేదు. నే వచ్చేసరికి రాజ్యంలేదు రాజమండ్రి వెళ్ళిపోయింది. అక్కడ రాఘవయ్య మేష్టారి తమ్ముడొకాయన ఏదో ఉద్యోగంలో ఉన్నాడు; ఆయనకి ఆడపిల్లల్లేరు. రాజ్యానికి చదువు మీద వున్న ఆసక్తి గమనించి -పెళ్ళయ్యే వరకూ నేను చదువు చెప్పిస్తాలెమ్మని తీసుకెళ్ళాడు.

అంతే, ఆ తర్వాత మళ్ళీ రాజ్యం నాకు కనబళ్ళేదు . శెలవలకి నేను ఇంటి కొచ్చినప్పుడు రాజ్యం వుండేది కాదు:తనొచ్చినప్పుడు నేనుండేవాణ్ని కాదు.

నే వచ్చినప్పుడల్లా రాజ్యాన్ని గురించి అడుగుతూ వుండేవాణ్ని. ' అదెక్కడొస్తుందిరా ? అది పట్నవాసం రుచి మరిగింది:వున్న వూరు మర్చి పోయింది, కన్నవాళ్ళని మర్చిపోయింది దానికింకా నువ్వూ నేనూ గుర్తుంటామా?' అంది, అమ్మ ఒకసారినాతో.

క్రమంగా నేనూ రాజ్యాన్ని మర్చిపోయాను. చదువులో మునిగిపోయాను. క్లాసులో మొదటి బెంచీలో కూర్చోడమూ, పరీక్షల్లో బాగాపాసవడమూతప్ప నాకు మరో ధ్యాస లేక పోయింది. ఆ రకంగానే హైస్కూలు, ఆ తర్వాతకాలేజి, ఆ పైన యూనివర్శిటీ చదువూ కూడాముగిశాయి.

ఆ లోగా చాలా మార్పులుజరిగాయి. రాజ్యం చదువుకూడా ముగిసింది. పెళ్ళి మాత్రం కాలేదు. ఇంటర్మీడియేట్ వరకు మాత్రం చెప్పించి ఆ పైన తనకీ వోపిక లేక వూరుకున్నాడు వాళ్ళ బాబాయి.

పెళ్ళి చేసే వోపిక లేక రాఘవయ్య మాష్టారు వూరుకున్నారు. ఆయనకి పెద్ద తనం వచ్చింది.ఊళ్ళో పిల్లలువెనకొచ్చినంత మంది ఇప్పుడాయన దగ్గరికి రావటం లేదు. పెద్ద కూతురు పెళ్ళి మాత్రం ఏదో చేసి పంపాడు గాని అందుకయిన అప్పు ఇంకా తీరలేదు. ఉన్న ఒక్క కొడుకూ తల్లిదండ్రుల్నీ తోడ బుట్టిన వాళ్ళనీ వదిలేసి దూరంగా వెళ్ళిపోయాడు.

చదువు ఆపేశాక కూడా రాజ్యం నాలుగైదేళ్ళు రాజమండ్రిలో పినతండ్రి ఇంట్లోనే ఉంది.పెళ్ళయితే తన దారిన తను పోతుందిగదా అని అన్నేళ్ళూ ఎలాగో వోపిక పట్టిన ఆమె పినతల్లి ఇంక పూరుకోలేక మొగుడితో దెబ్బలాడి రాజ్యాన్ని ఇంట్లోంచి గెంటేసింది.

ఆ రకంగా యింటికి చేరిన రోజునే - ఆవేళ ఆకస్మాత్తుగా ఆ వెన్నెల్లో నా దగ్గరకొచ్చి కూర్చుంది రాజ్యం -

రాజ్యానికప్పటికి ఇరవయ్యేళ్ళుదాటాయి. మనిషి బాగా ఎదిగింది. అనవాలు పట్టలేనంత అందమొచ్చింది, వయసువయ్యారాలుతెచ్చింది. నడిచినా, నవ్వినా, అటు తిరిగినా యిటు తిరిగినా, కన్నెత్తి చూసినా, కంఠం విప్పినా, మరేం చేసినా కూడా మగాణ్ని కలవరపెట్టి కవ్వించే అందం రాజ్యానిది.

పొద్దున కాస్సేపూ,సాయంత్రం కాస్సేపూ, వాళ్ళమ్మకి ఇంటి పనుల్లో సాయం చెయ్యటంతప్ప - రాజ్యానికి మరేమీ పనిలేదు. నాకసలెప్పుడూ పని లేదు.రాజ్యం రోజూ మా యింటికొచ్చేది. గంటల తరబడి కూర్చునేవాళ్ళం. పేకాట ఆడేవాళ్ళం, క్యారమ్స్ ఆడేవాళ్ళం, కబుర్లు చెప్పుకునే వాళ్ళం, చిన్నప్పటి లాగా, మేమిద్దరమూ మళ్ళీ మంచి స్నేహితులమైపోయాం.

రాజ్యం రావడంతో నా ఒంటరితనం, ఉద్యోగమింకా రాలేదన్న చిరాకూ దిగులూ - ఇవన్నీ ఎగిరిపోయాయి. ఇంకా కొన్నాళ్ళు ఉద్యోగం రాకుండా ఉంటేబావుండునని కూడా అనుకున్నాను చాలా సార్లు.

నేను కాలేజీలోనూ,యూనివర్శిటీలోనూ చాలా మంది అమ్మాయిల్నిచూశాను. వాళ్ళల్లో కొందరు నాతో స్నేహంగా ఉండేవారు. కాని రాజ్యం లాంటి మనిషిని ఎక్కడా చూళ్ళేదు ఆకారంలోనూ అందంలోనే కాదు; మాటలో, మనసులో కూడా రాజ్యం లాంటి వాళ్ళు చాలా అరుదు.

రాజ్యంలో రోజు రోజుకో అందం కనిపిస్తోంది; గంటకో ఆకర్షణ కనిపిస్తోంది: నాకు పిచ్చెక్కుతోంది.

ఆ వేళ సాయంత్రం రాజ్యం నా దగ్గరకి రాలేదు. ఆమెకోసం చూసి చూసి,చివరికి వాళ్ళింటికీ మా యింటికీ మధ్య నున్న గోడదగ్గర కెళ్ళి నిలబడ్డాను - ఎక్కడన్నా కనబడుతుందేమోనని; కనబళ్ళేదు. ఇంట్లోకి తిరిగొచ్చి మా అమ్మ నడిగాను. వాళ్ళమ్మతో కలిసి ఎవరింటికో పేరంటాని కెళ్ళిందట!

ఇంకేమీ చేసేదిలేక, ఏమీ తోచక కాస్సేపలా వూరిబయటికెళ్ళి పొలాల వెంట తిరిగొచ్చాను.ఇంటికొచ్చే సరికి బాగా చీకటి పడింది. అప్పటిదాకా వీచిన వడగాలి చల్లబడిందిచన్నీళ్ళతో స్నానం చేస్తే హాయి అనిపించింది. భోంచేసి, పైకి నా గదిలోకి వెళ్ళిపోయాను.

మాది పాతకాలపు డాబాయిల్లు-నేను కాలేజీ చదువులకొచ్చాక, నా కోసమని డాబాపైన ఒక చిన్నగది వేయించారు నాన్నగారు. నేను వూళ్ళో ఉన్నప్పుడు తప్ప మిగతా రోజుల్లో ఆ గది తాళం వేసి ఉంచుతారు.నేను ఉన్నప్పుడు మాత్రం స్నానం,భోజనం ఇలాంటి వాటికి తప్ప కిందికెళ్ళను. పైన నా గదిలోనే వుంటాను.

ఆ వేళ భోంచేసి నేను పై కొచ్చేసరికి నిండుగా వెన్నెలొచ్చింది. గాలి మరింత చల్లబడింది. కాస్సేపు డాబా మీద పచార్లు చేసి, గదిలో కెళ్ళి పడుకుని ఏదో పుస్తకం విప్పాను. - ఎక్కువసేపు చదవ లేకపోయాను - ఎందుకనో త్వరగా నిద్రొచ్చింది లైటు తీసేసి పడుకున్నాను.

ఎంత సేపు నిద్రపోయానో ఎందుకు మెలకువొచ్చిందో తెలీదుగాని, నేను కళ్ళు విప్పి చూస్తే -కిటికీ లోంచి వెన్నెలొచ్చి నా పక్కమీద సగం మేర పాకింది. అటుపక్క చూస్తే రాజ్యం నా పక్కన పడుకుని వుంది. నేనదిరిపడి చూస్తే - అలవోకగా నవ్వుతోంది. 'ఏమిటీ మరీఅంత మొద్దునిద్ర...?' అని నన్ను మెల్లగా అడుగుతోంది.

కాస్సేపటికి నా కంగారు తగ్గింది. రాజ్యం వంక పరిశీలనగా చూశాను. రాజ్యం ఆ వేళ తలంటుకుంది. తెల్ల చీరెకట్టుకుంది, తల నిండా మల్లెపూలు పెట్టుకుంది;తాంబూలం వేసుకుంది గావును -పెదాలు మరీ ఎర్రగా ఉన్నాయి; పేరంటంలో పూసుకున్న గంధం గర్హం కింద యింకా అలాగే ఉంది.

ఆమె అందం చూసి నా కసలు నోట మాట రావటంలేదు . రాజ్యం కూడా ఒకటి రెండు మాటలకి మించి మాట్లాడలేదు - కాని అప్పటికే ఆమె చేతులు పూలతీగలయినన్ను చుట్టుకున్నాయి. ఆమె కళ్ళ ల్లోంచి, కదిలే ఆమె పెదవుల్లోంచి - కోటి కోరికలు పైకిలేచి నన్ను ఆహ్వానిస్తున్నాయి; ఆక్రమించుకుంటున్నాయి.

ఆ రాత్రి, ఆ వెన్నెల్లో, తెల్లటి నా పక్కమీద రాజ్యం తన అద్భుతమైన అందాలన్నీ ఆవిష్కరించింది. నా జీవితంలో ఆప్పటిదాకా ఎరగని అపురూపమైన సౌఖ్యాన్ని అరమరలు లేకుండా దోసిళ్ళతో అమృతం తాగినట్లు తాగాం; రాజ్యం ఆ రాత్రి తెల్ల వారేదాకా నాతోటే ఉంది.

అక్కడ ప్రారంభమైంది మా అసలు కథ.

ఆ తర్వాత అలాగే యింకా చాలా రాత్రులు రాజ్యం నా దగ్గర కొచ్చింది. రాత్రి ఏ పదింటికో, పదకొండింటికో తల్లీ తండ్రీ పడుకున్నాక, మెల్లగా లేచి రెండిళ్ళ మధ్యా ఉన్న మొండి గోడ అవలీలగాదాటి, ఆపక్కనేఉన్న మెట్లెక్కి పైకొచ్చి, తలుపులు తెరిచి వుంచిన నా గదిలోకి నిరభ్యంతరంగా ప్రవేశించి, నిలబడి ఆమెకోసమే చూస్తున్న నన్ను నిలువునా కమ్ముకునేది రాజ్యం. మెట్ల దారియింట్లో కాకుండా దొడ్లో ఉండటం; పొరపాటున కూడా అమ్మా - నాన్నా ఎన్నడూ పైకి రాకపోవటం - మాకు అడ్డూ అదుపూ లేకుండా చూశాయి.

ప్రతి రాత్రీ పెరగటమే గాని తరగట మన్నది ఎరగని వెన్నెలగా వికసించేది రాజ్యం. ఆమె శరీరం రోజూ ఒక కొత్త పువ్వులా పరిమళించేది.

ఈ రకంగా చాలా రోజులు గడిచాయి. కాని అవన్నీ క్షణాల్లాగ గడిచాయి.

మేం చేస్తున్న పనేమిటి, అది తప్పా ఒప్పా అనిగాని, దాని పర్యవసానమూ ఫలితాలూ ఏమిటనిగాని మేమెన్నడూ ఆలోచించలేదు.ప్రేమ , పెళ్ళి ఇలాంటి మాటలు మా మధ్య యెన్నడూ రాలేదు.రాజ్యమే అలాంటి మాటలెప్పుడూ అనలేదు, మరింక నాకేమిటి? ఒక్కటి

మాత్రం చెప్పగలను - అనుక్షణమూ మేం ఒకళ్ళనొకళ్ళు కోరుకున్నాం; అన్ని నీతులకీ నియమాలకీ అతీతమైన ఆనందాన్ని అనుభవించాం. ఆ ఆనందం, ఆ అనుభవం కేవలం శారీరకమే అంటానికి వీల్లేదు.

కాని - మా ఆనందం ఆ పైన అట్టే కాలం నిలవలేదు. ఒక నాటి రాత్రి నా దగ్గరకొచ్చి, అంతా అయ్యాక వెళ్లే ముందు, చీరకట్టుకుంటూ - 'నన్ను పెళ్ళి చేసుకుంటావా?'అని అడిగింది రాజ్యం. ఆ మాటకి ఆశ్చర్యపోయి అదిరిపడ్డనేను సమాధానం చెప్పకముందే - 'మరేం చేస్తావో చెయ్యి... నాకు నెల తప్పింది' అంది.

భయంగాని ఆందోళనగాని అణు మాత్రమైనా లేకుండా , అతి నిశ్చలంగా నిదానంగా ఆ మాటలు చెప్పింది. నాకు మాత్రం ముచ్చెమటలు పోశాయి. నోట మాటరాక గుడ్లప్పగించి గుటకలు మింగుతూ కూర్చున్నాను.

రాజ్యం నవ్వుతూ నా దగ్గరకొచ్చి తన పైట చెంగుతో నా నుదుటిమీద చెమట తుడుస్తూ - 'వెర్రివాడా! నీవల్ల ఏమీ కాదు। నాకు తెలుసు , నేను ఏదో ఒకటి చేస్తాలే, భయపడకు చిన్నా!' అనేసి వెళ్ళిపోయింది.

'చిన్న'అనేది నా చిన్నప్పటి ముద్దు పేరు. నేను పెద్దవాడి నయ్యాకకూడా రాజ్యం నన్నలాగే 'చిన్నా' అని పిలిచేది.

ఆ తర్వాత కథ చాలా తర్వగా నడిచింది. రాజ్యం శరీరంలో వచ్చినమార్పు ఎన్నాళ్ళో దాగలేదు.

ఒకనాటి ఉదయం వాంతులు చేసుకుంటూవుంటేవాళ్ళమ్మే పట్టుకుంది. నిలదీసి అడిగితే రాజ్యం నిజం చెప్పేసింది. ఇంకేముంది. రాజ్యం తల్లి ఏడుస్తూ గుండెలు బాదుకుంటూ మా ఇంటికొచ్చిపడింది.

'మా అబ్బాయి అలాంటివాడేమీకాదు; అతనే తప్పూ చెయ్యలేదు; ఇదంతా మా వాణ్ణి వల్లోవేసుకుని పెళ్ళి చేసుకోడానికి మీ అమ్మాయి పన్నిన పన్నాగం;దీంతో మాకేమీ సంబంధం లేదు; ఇప్పుడు మేం చెయ్యగలిగిందీ ఏమీలేదు. మర్యాదగా అవతలికి పొమ్మ'ని, ఆవిణ్ణి గెంటేసింది మా అమ్మ.

నాలుగు రోజుల్లో ఈ విషయం వూరంతా గుప్పుమంది. అయిదోరోజున రాజ్యం తల్లి నూతిలో దూకింది. ఇరుగు పొరుగు వాళ్ళంతా వచ్చి బయటకిలాగారు; బ్రతికించారు.

నాన్నగారు నన్నుపట్టుకొని నానాతిట్లూ తిట్లారు. ఇక ముందైనా జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు.

రాజ్యం నాకు కనబడ్డం మానేసింది. నేను కొన్ని రోజులు ఇంట్లోంచి బయటికి వెళ్ళలేదు.

రాఘవయ్య మేష్టారు మరీ చితికి పోయారు. ఆయనదగ్గరకొచ్చే ఆ నలుగురు పిల్లలు కూడా రావటం మానేశారు.

దిగులుతో మంచం పట్టినభార్యనీ, వూరందరి అపవాదులకీ అలంబనగా మారిన కూతుర్నీ వెంటపెట్టుకుని ఆయనవూరిడిచి పెట్టి వెళ్ళిపోయారు. వెళ్ళేరోజు మధ్యాహ్నం నేను రట్లో బావిదగ్గర కాళ్ళూ చేతులూకడుక్కుంటూ వుండగా ఎప్పుడొచ్చిందో, ఎలా వచ్చిందో, నా నకనించి వచ్చి - 'చిన్నా' అని పిలిచింది. రాజ్యం. నా గుండె ఝల్లుమంది. వెనక్కి తిరిగాను. రాజ్యం మరో అడుగు ముందుకు వేసి నా దగ్గరకొచ్చింది.

ఆమె ఎప్పటిలాగేవుంది; మొహం మాత్రం కాస్త కళతప్పింది . పెదాలమీద ఆ చిరునవ్వు మాత్రం చెక్కుచెదర లేదు.

'చిన్నా, నేను వెళ్ళిపోతున్నాను: మళ్ళీ ఈ జన్మలో నిన్ను చూడగలనో లేదో.. త్వరగా పెళ్ళిచేసుకో...నన్ను కాస్త గుర్తుంచుకో...' అని చటుక్కున నా పెదాలమీద చిన్న ముద్దు పెట్టి క్షణంలో అక్కణ్ణించి వెళ్లిపోయింది.

ఆ మర్నాడే నాకువుద్యోగమొచ్చింది. ఉద్యోగమొచ్చిన నెల రోజుల్లో మంచి సంబంధమొచ్చింది. పెళ్ళి చేసుకుని పెళ్ళాన్ని వెంట పెట్టుకుని హైదరాబాద్ వెళ్ళిపోయాను.

అయిదారేళ్ళుగడిచాయి. ఈ లోగా రాజ్యాలు మారాయి; రాజులు మారారు; నాకు ప్రమోషనొచ్చింది; ఇద్దరు పిల్లలు పుట్టారు; రాజ్యం గురించి మాత్రం చాలా రోజులు నాకేమీ తెలీలేదు.

చివరి కొకనాడు విశాఖపట్నంలో వుంటున్న నా బాల్యస్నేహితుడొకడు హైదరాబాద్‌లో కనపడి- రాఘవయ్య మేష్టారు మా వూరినించి మరోవూరు చేరారనీ, రాజ్యం కడుపు తీయించుకుని, ఎవరో ఒకతన్ని పెళ్ళి చేసుకుని, ఇప్పుడతన్తో విశాఖపట్నంలోనే వుంటోందనీ చెప్పాడు.

నాకు పై వుద్యోగ మొచ్చినప్పట్నించీ ఆఫీసు పనులమీద అన్నివూళ్ళూ తిరగటం ఎక్కువైంది. అలాంటి పని మీదే ఒక సారి విశాఖపట్నం వెళ్ళాల్సివచ్చింది.

నాలుగు రోజుల్లో పనులన్నీ ముగించుకుని ఇంక ఆ రాత్రికి వెళ్ళి పోదామనుకుని- పిల్లలకేమైనా కొందామని, సాయంత్రం బజార్లో తిరుగుతూవుంటే, బట్టలషాపులో రాజ్యం కనిపించింది.

ఎప్పటిలాగే ఏమనాలో తెలీక, నేను తెల్ల మొహం వేసుకుని చూస్తూ నిలబడితే - తనే ముందుకొచ్చి, ముందుగా నన్ను పలకరించింది -

"చిన్నా, బాగున్నావా?' అని .

అన్నేళ్ళలోనూ ఆమె వయసు పెరిగిందో తరిగిందో నాకర్థం కాలేదు. వెనకటి కంటే కొద్దిగా లావైంది, ఇంకా అందమొచ్చింది. ఆ చూపులో అదే వెన్నెల; ఆపెదాలమీద అదే ముచ్చటైన చిరునవ్వు!

ఇద్దరమూ బయటికొచ్చి దగ్గర్లోవున్న హోటల్లో కూర్చుని కాఫీ తాగాం. నా గురించి అన్ని వివరాలూ అడిగి తెలుసుకొంది రాజ్యం. తనగురించి అడగటానికి నాకు ధైర్యం చాల్లేదు!; తనే చెప్పింది- భర్త పేరు కోటేశ్వర్రావనీ, అతనేదో ఆఫీసులో గుమస్తా అనీ, నల్లగా చింబోతులా వుంటాడనీ చెప్పి నవ్వింది.

"రాఘవయ్యమేష్టారు ఎక్కడున్నారు ఎలా వున్నా" రని అడిగాను.

"ఎక్కడా లేరు... అమ్మా నాన్నా యిద్దరూ పోయారు"...అంది. "పిల్లలెందరు? అని అడిగాను, కాస్త ధైర్యం తెచ్చుకుని.

"లేరు....నీతోనే సరి. మళ్ళీ ఏమీ లేదు...." అని నవ్వింది.

రాజ్యం నన్ను వెంట బెట్టుకుని తన యింటికి తీసుకెళ్ళింది. ఎక్కడో ఇరుకు సందుల్లో న్న రేకుల షెడ్డులో వుంటోంది.

వర్ధన్న కొద్దీ వంటచేసి అన్నం పెట్టింది. ఏడీ మీ ఆయనింకా రాలేదే అన్నాను. ఇప్పుడెక్కడొస్తాడు. తప్ప తాగి ఏ ఒంటిగంటకో చేరతాడు" అంది నవ్వుతూ.

"ఇక నేవెళ్తాన"ని లేచి బయల్దేరబోతూంటే "ఇన్నాళ్ళకి మళ్ళీ కనిపించావు ఇంకా రెండు 'జులుండి వెళ్ళు చిన్నా..." అంది రాజ్యం; ఆమె మాటలకి ఎదురు చెప్పే ధైర్యం నాకేనాడూ లేదు. ఉండి పోయాను.

ఆరాత్రీ, ఆ మర్నాటి రాత్రీ కూడా రాజ్యం హోటల్లో నా గది కొచ్చింది. నా భార్య నాకు ోత బడిపోయింది. అవసరం తప్ప అంతగా సుఖం దొరకటం లేదు. రాజ్యం మళ్ళీనాకు స్వర్గద్వారాలు తెరిచింది.

మూడో నాడు బయల్దేరి వెళ్ళిపోయాను. ఆ తర్వాత కనీసం నెలకొకసారయినా విశాఖపట్నం రావటం, రాగానే ఏదో రకంగా రాజ్యాన్ని కలుసుకోవటం అక్కడున్న రెండు నాడు రాత్రులూ ఆమె నాహోటల్ కొచ్చి నాతో గడపటం ఇలా జరుగుతోంది.

ఈసారి విశాఖ పట్నమొచ్చి నాలుగు రోజులైంది. రాగానే రాజ్యానికి కబురు చేశారు. 'జ్యం రాలేదు. నేను వెళ్దామంటే ఆఫీసు పనులు తలమునకలుగా వుండి తీరిక దొరకలేదు.

చివరికివ్వాళ సాయంత్రం మొచ్చింది రాజ్యం. నేనంతకుముందే బయటనుంచి వచ్చి

స్నానం చేసి టీ తాగుతూ కూర్చున్నాను.

తలుపు తోసుకుని చేతిలో ఒక సూట్‌కేస్‌తో , మాసిన చీరతో, రేగిన జుట్టుతోఎర్రబడిన కళ్ళతో రాజ్యం గదిలోకి వచ్చింది.

వచ్చీరాగానే తలుపుమూసి సూట్‌కేసు గోడ పక్కన పెట్టి ఒక్కవుదుటున నా మీద వచ్చిపడి 'చిన్నా నేను వోడిపోయాను, నేనింక బ్రతకలేను,' అని బావురుమని ఏడ్చింది.

రాజ్యం నవ్వితేనే నోట మాటరాని నేను, అసలీ మనిషి జీవితంలో దిగులూ విచారమూ అనే మాటలున్నాయా అని పించే ఆమె అలా అకస్మాత్తుగా వచ్చి ఆ విధంగా ఏడుస్తుంటే ఏమనగలను? ఏం చెయ్యగలను? ఆమెను ఓదార్చడం నా తరమా!

కాస్సేపటికి తనంతతానే నెమ్మదించింది రాజ్యం. తన కళ్ళు తనే తుడుచుకుంది చెప్పవలసినదంతా తనే చెప్పింది. ఆమె భర్తమరీ హద్దు మీరిపోయాడట; నెల జీతమంతా నాలుగు రోజుల్లోనే తగలేస్తున్నాడట; పగలూ రాత్రీ అదేపనిగా ఆఫీసు కూడా మానేసి తాగుతున్నాడట; ఆమెను పట్టుకుని రోజూ చావబాదుతున్నాడట.

ఈ నాల్రోజుల్నించీ తను రాలేక పోవటానికి అదే కారణమని చెప్పింది రాజ్యం అతనామెని గదిలో పెట్టితాళం వేశాడట; మా ఇద్దరి సంగతీ అతనికి తెలిసిపోయిందట

"ఎలాగో తప్పించుకుని పారిపోయొచ్చాను, ఇక మళ్ళీ అయింట్లో అడుగుపెట్టను ఆనరకం నేవింక భరించలేను; నన్ను నీతో తీసుకెళ్ళిపో చిన్నా" అంది రాజ్యం.

నా గుండెల్లో రాయి పడింది.

"భయపడకు చిన్నా! నేను నీకు బరువేమీ కాను; నీ ఇంట్లో వచ్చి కూర్చోను: వేరే ఎక్కడయినా వుంటాను;నాకేదయినా చిన్న ఉద్యోగమిప్పించుచాలు, ఎంత చిన్నదైనా చాలు నాకు తిండికీ బట్టకీ సరిపోతే చాలు; నువ్వు నన్ను పెళ్ళిచేసుకోనక్కరలేదు; నన్ను వెంటబెట్టుకు తిరగనక్కర్లేదు; నాకోసం నీభార్యా బిడ్డల్నీ, నీ పరువు మర్యాదల్నీ వొదులుకోనక్కర్లేదు నీయిష్టమొచ్చినప్పుడే నీకు వీలయినప్పుడే వచ్చి నా దగ్గర కాస్సేపుండి వెళ్ళు; ఏమంటావు చిన్నా?" అంది రాజ్యం

నేనేమీ అనలేక పోయాను.

'ముందు నాకు కాస్త అన్నం పెట్టించుచిన్నా...ఆకలి మండిపోతోంది... నిన్నట్నించీ ఏమీ తినలేదు...' అంది రాజ్యం. వెంటనే బోయ్‌నిపిలిచి ఇద్దరికీ భోజనాలు తెమ్మన్నాను.

రాజ్యం లేచి వెళ్ళి స్నానంచేసింది. సూట్‌కేస్‌లోంచి ఒక చీర తీసి కట్టుకుంది. తల దువ్వుకుంది. పౌడరు రాసుకుని, బొట్టూ కాటుకా పెట్టుకుంది. 'చిన్నా, కాసిని పూలు తెప్పించకూడదూ?-' అంది. తెప్పించాను. తల నిండా పెట్టుకుంది.

ఇద్దరం అన్నాలు తిన్నాం రాజ్యం తృప్తిగా కడుపారాతింది బోయ్ కిళ్ళీలు తెచ్చి ఇచ్చి ఖాళీ ప్లేట్లు తీసుకెళ్ళి పోయాడు

బయటి సంగతి ఏమోగాని, నాగదిలో మళ్లీ వెన్నెలొచ్చింది రాజ్యం మళ్లీ మామూలుగా నవ్వింది ఆమె మళ్లీ వెన్నెల వరదై, మధురపరిమళమై నన్ను ఆవరించింది, ఆక్రమించింది

'ఆలోచించుకో చిన్నా రేపొద్దున నీతోపాటు నన్ను తీసుకెళ్తావో లేదో, యికనీ యిష్టం నాకు నిద్రొస్తున్నది నన్ను కాస్సేపు కదిలించకు ' అని, ఆవులించి, కళ్ళు మూసుకుని, అంతలోనే నిద్రపోయింది రాజ్యం ఆమె బాగా అలసిపోయింది

* * *

ఎక్కడో దూరాన నాలుగు గంటలు వినిపించాయి మరో గంట గంటన్నరలో తెల్లగా తెల్లారిపోతుంది వేసవి కాలం, అప్పటికి బాగా చల్లగాలి తిరిగింది హోటల్లో నౌకర్లూ, వంట మనుషులూ అప్పుడే లేచి హడావిడి చేస్తున్నారు బయట రోడ్డుమీద-మనుషులూ, కార్లూ లారీలూ, రిక్షాల రద్దీ మెల్లగా పెరుగుతోంది

బాల్కనీలోంచి లేచిగదిలోకి వచ్చాను రాజ్యం ఇంకా లేవలేదు ఇప్పటికీ అలాగే నిద్రపోతోంది

గబగబా నా బట్టలూ సామాన్లూ అన్నీ సర్దుకున్నాను రాజ్యంవంక ఒక్కసారి సరిగ్గా చూడ్డానికి కూడా ధైర్యం చాలక-పెట్టే బేడా పుచ్చుకుని కిందికొచ్చేశాను రిసెప్షన్ కౌంటర్ దగ్గరకెళ్ళి హోటల్ బిల్లు కట్టేసి-'నా గదిలో ఒక అమ్మాయి పడుకుని వుంది, ఆ అమ్మాయి నిప్పుడు లేపొద్దు, ఆమె ఉంటానంటే మరో నాల్రోజులు ఇక్కడే ఉండనివ్వండి ' అని మరో రెండు వందలు తీసి హోటల్ వాళ్ళకిచ్చాను ఈ హోటల్లో నాకు మంచి పలుకుబడి ఉంది టాక్సీ తెప్పించుకుని ఎక్కి కూర్చున్నాను స్టేషన్‌కొచ్చి రైల్లో కూర్చుని, ఒక్కసారి బరువు తగ్గినట్టుగా నిట్టూర్చాను

* * *

ఇదంతా జరిగి చాలా కాలమైంది. నాకు ఇంకో ప్రమోషనొచ్చింది ఈ మధ్యనే కారు కొన్నాను ఇప్పుడెక్కడికీ టూర్లు లేవు. విశాఖపట్నం వెళ్ళాల్సిన అవసరం అసలేలేదు ఆ వూళ్ళో మా కంపెనీ బ్రాంచి మూసేశారు

ఆ వేళ అలా వదిలేసి వచ్చాక రాజ్యం ఏమైందో ఇప్పటికీ నాకు తెలీదు

కాని నా జీవితం లోంచి వెన్నెల మాత్రం వెళ్ళిపోయింది మళ్ళీ యిక రాదు ●

*(ప్రభవ మాస పత్రిక - ఏప్రిల్ - 1978)*